క్లుప్తంగా

గ్యార్మీ నూతన కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఎస్‌ఎం.గౌసన్

కొడంగల్ రూరల్: పట్టణంలోని మక్కామసీద్ గ్యార్మీ కమిటీ సభ్యులను ఆదివారం మసీద్‌లో మాజీ ఉప సర్పంచ్ ఎస్‌ఎం.గౌసన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ ముజీబ్, ఉపాధ్యక్షుడుగా షేక్‌ఖలీద్, ప్రధాన కార్యదర్శిగా హఫీజ్, షేక్ ఆదిల్, కార్యదర్శిగా ఎండీ.వాజిద్, సహాయ కార్యదర్శిగా అబ్దుల్‌ఖరీంతో పాటు పదకొండు మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం నూతన సభ్యులను సన్మానించారు. ఇందులో సయ్యద్ ఇసాక్ పాష, అబ్దుల్ జబ్బార్, ఖాజామొయినొద్దీన్, ఆసిఫ్ ఖాన్, అబ్దుల్ సత్తార్, అబ్దుల్ ఖాదర్, ఎండీ సిరాజొద్దిన్ ఉన్నారు.

బీజేపీలో బీసీలకు ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరప్ప

పరిగి: భారతీయ జనతా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు వెన్న ఈశ్వరప్ప అన్నారు. ఆదివారం పరిగి పట్టణ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో పార్టీ అధికారంలోకి వస్తే బీసీకి చెందిన వారినే సీఎంను చేస్తామని పార్టీ హస్తిన పెద్దలు ప్రకటించడం హర్షణీయమన్నారు. జాతీయ, ప్రాంతీయ పార్టీలు బీసీలను చిన్న చూపు చూస్తున్నాయని, సామాన్యుడైన బీసీ నేత మోదీని ప్రధానిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని పేర్కొన్నారు. బీసీలు ఏకమై రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వాస్తవాలు మాట్లాడితే జీర్ణించుకోలేరు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: బీఆర్‌ఎస్ పాలనపై వాస్తవాలను మాట్లాడితే ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్లచెన్నయ్య ఏర్పాటు చేసిన సమావేశంలో పీసీసీ సభ్యుడు మహ్మద్ అలీఖాన్‌బాబర్, ఎస్టీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు, పార్టీ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి మాట్లాడారు. పెంజర్ల సభలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లిప్రతాప్‌రెడ్డి రాజకీయ విమర్శలు చేస్తే అందుకు ప్రతిగా రాజకీయ విమర్శలు చేయాలే కానీ పరుష పదజాలం వాడటం బాధాకరమన్నారు. బీఆర్‌ఎస్‌ని వీడి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీలు తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు జమృద్‌ఖాన్ తదితరులు బీఆర్‌ఎస్ అవినీతి పాలనపై వాస్తవాలను మాట్లాడితే కొందరు నాయకులు పనిగట్టుకొని వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లిశంకర్ గెలిస్తే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో శ్రీనునాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి..

మొయినాబాద్‌రూరల్: ఎన్నికల్లో ఆశీర్వదించి కాంగ్రెస్‌ను గెలిపించాలని చేవెళ్ల శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ అన్నారు. చిన్నమంగళారం గ్రామానికి చెందిన రైతులు, యువకులు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకే ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ చేసింది శూన్యమని, కేవలం ప్రభుత్వ పథకాలతో ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ని ఆశీర్వదించి గెలిపిస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో పూలగుర్లా గోపాల్‌రెడ్డి, ఆడెం విజయరామ్‌రెడ్డి, నాగులపల్లి నారాయణ, వడ్డె నర్సింహులు, రైతులు, యువకులు ఉన్నారు.

జోరందుకున్న ప్రచారం

కొందుర్గు: ఎన్నికల సమయం దగ్గర పడేకొద్ది అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ ప్రచారాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఖరారు కావడంతో ఆ పార్టీల నాయకులు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు, బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తేనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని, గ్యారంటి లేని పార్టీకి ఓటువేసి మోసపోవద్దని బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నారు.

జోరుగా ఫిరాయింపుల పర్వం



ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ముస్లింలు తదితరులు

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పార్టీల ఫిరాయింపులు జోరుగా సాగుతున్నాయి. ఇంత కాలం పార్టీలో పనిచేస్తున్నా తమకు తగిన గుర్తింపు లేదని కొందరు, వలస వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఇంకొందరు అలక పూనుతున్నారు. పెద్దలు బుజ్జగించినప్పటికీ.. పార్టీ మార్పునకే మొగ్గు చూపుతున్నారు. ఆదివారం మోమిన్ పేట మండలం వెల్‌చాల్‌కు చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు కిరణ్ కుమార్‌తో పాటు బీఎస్పీ నుంచి సూర్యపేట కృష్ణ తదితరులు మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇక దేవరంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నేత ముత్యంరెడ్డి తదితరులు ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోగా.. కొందరు ముస్లింలు ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో కారులో చేరారు.

– మోమిన్‌పేట



వెల్‌చాల్‌లో కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న గడ్డం ప్రసాద్‌కుమార్

బీజేపీతోనే సుపరిపాలన

- కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి
- మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

నవాబుపేట: తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలన రాజ్యమేలుతుందని, ఈ పాలనకు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కేఎస్ రత్నం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నేను జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులే నేటికీ దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల భవనాలు, మూసీపై వంతెన, పలు గ్రామాలకు బీటీ రోడ్లు, సబ్ స్టేషన్లు నేనే వేయించాను. ఇవి చేయలేదని నిరూపిస్తే.. ముక్కు నేలకు రాస్తా' అని ఆయన అన్నారు. పోలీసులు, అధికార పార్టీ నేతలు ఒక్కటై ఇతర పార్టీ నాయకులపై అక్రమంగా కేసులు పెడుతున్నారని, పోలీసులు అందరినీ సమానంగా చూడాలని సూచించారు. బీఆర్‌ఎస్ అవినీతి, దోపిడీ పాలనను అంతమొందించాలని, బీజేపీ ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతోనే సుపరిపాలన సాధ్యమని, అన్ని రంగాల్లో కేంద్రం దూసుకుపోతుందని పేర్కొన్నారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, నాయకులు గోపాల్, రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సాయి కుమార్, గోపాల్ గౌడ్, గాలయ్య, నర్సింహులు, శ్రీధర్, శ్రీహరి, రమేష్ తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రితోనే సమన్యాయం

- అన్ని వర్గాలను అక్కున చేర్చుకున్న కేసీఆర్
- కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరు
- మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆదరించండి
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు



పరిగి: ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ తదితరులు

పరిగి: బీఆర్‌ఎస్ పార్టీకి మరోసారి పట్టం కట్టాలని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణ కేంద్రంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. అనంతరం మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. అందరినీ దృష్టిలో ఉంచుకొని సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించారని వెల్లడించారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మున్సిపల్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. జిల్లాలోనే పరిగి మున్సిపాలిటీ ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. పరిగి అభివృద్ధిని చూసి అధికార పార్టీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఇందులో స్థానిక నాయకులు ఉన్నారు.

రోహిత్‌రెడ్డిని గెలిపించాలి

బంట్వారం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు రావిరాల ఆనంద్ పిలుపునిచ్చారు. పార్టీ నాయకులతో కలిసి కోట్‌పల్లి మండల కేంద్రంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందని, కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఇందులో బీఆర్‌ఎస్ నాయకులు సమ్మయ్య, శ్రీనివాస్ ఉన్నారు. ఇదిలా ఉండగా.. బీఆర్‌ఎస్ యూత్ వింగ్ బంట్వారం మండల అధ్యక్షుడు గాలి బల్వంత్ తొర్మామిడిలో ఇంటంటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్‌ను గెలిపించాలని కోరారు.



బంట్వారం: తొర్మామిడిలో బల్వంత్ ప్రచారం

మరోసారి అవకాశం..

తాండూరు రూరల్: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ప్రచారంలో భాగంగా కోట బాసుపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో వారు పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడారు. కేసీఆర్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. ఇందులో సర్పంచ్ కుర్వ నాగార్జున, నాయకులు వీరేందర్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, మొగులప్ప ఉన్నారు.

ఆనంద్ గెలుపు ఖాయం

ధారూరు: ప్రజల కష్ట సుఖాలు తెలుసుకుంటూ వారి మన్ననలను పొందిన వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ రెండోసారి గెలవడం ఖాయమని బీఆర్‌ఎస్ నాయకులు ఆశాభావం వ్యక్తంచేశారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో వారు పర్యటించారు. కారు గుర్తుకు ఓటేసి ఆనంద్‌ను గెలిపించాలని కోరారు. ఇందులో ధారూరు సర్పంచ్ చంద్రమౌళి, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు హఫీజ్, బీఆర్‌ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి, అంజయ్య, లక్ష్మయ్య, మౌలాన ఉన్నారు.

అనాథలకు సరుకుల పంపిణీ



చిన్నారులకు సరుకులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కొడంగల్ రూరల్: అమ్మా నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు చిన్నారులకు సరుకులు పంపిణీ చేశారు. టేకుల్‌కోడ్ గ్రామానికి చెందిన అభిలాష్, అనిల్, కొండారెడ్డిపల్లికి చెందిన మధు, మమత, పాత కొడంగల్‌కు చెందిన ఇద్దరు వికలాంగులు ఆశప్ప, భీమయ్య అనే చిన్నారులకు ఆదివారం పట్టణంలోని ఓ పాఠశాల ఆవరణలో కిరాణ సరుకులతో పాటు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఫౌండర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. అనాథలకు రాబోయే రోజుల్లో తమకు తోచిన సహాయం అందజేస్తామని తెలిపారు. సభ్యుడు నరేష్‌రాజ్ మాట్లాడుతూ అనాథ విద్యార్థులకు తమ పాఠశాలలో ఫ్రీ ఎడ్యుకేషన్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఫౌండేషన్ బృందం అనిల్‌కుమార్, వెంకట్‌రాములు, డాక్టర్ చందు, జనార్దన్, గుండప్ప, అశోక్, అరవింద్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

షాబాద్: షాబాద్ మండలం తాళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత ఉపాధ్యాయులు బాల్‌రాజ్, రాంరెడ్డి హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయులతో విద్యార్థులు మాట్లాడారు. ఒకరినొకరి యోగక్షేమాలు కనుగొన్నారు. బాల్య మిత్రులంతా నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాండు, నాగేందర్‌రెడ్డి, సుధాకర్, నర్సింహారెడ్డి, మల్లేశ్, నర్సింహులు, మహేందర్‌రెడ్డి, అశోక్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య సతీమణి, జెడ్పీటీసీ జయమ్మ



ఎన్నికల ప్రచారంలో జయమ్మ

చేవెళ్ల: ప్రజా సంక్షేమం, అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని, అవి కొనసాగాలంటే మళ్లీ తమ పార్టీనే గెలిపించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య సతీమణి, నవాబుపేట జెడ్పీటీసీ కాలె యాదమ్మ, కోడలు నవాబుపేట ఎంపీపీ కాలె భవాని, ఎంపీపీ ఎం విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం. మాలతిలు కోరారు. కేసారం, మండల కేంద్రంలోని సీపీఐ, రంగారెడ్డి, హౌసింగ్‌బోర్డు కాలనీలలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బీఆర్‌ఎస్‌నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలంటే మళ్లీ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రావాలని చెప్పారు. ఎమ్మెల్యేగా యాదయ్యను మరోసారి గెలిపించాలని వారు కోరారు. ప్రచారంలో సర్పంచులు వెంకటేశంగుప్తా, మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి, నరహరిరెడ్డి, శివారెడ్డి, ప్రభాకర్, ఎం. రమణారెడ్డి, క్రిష్ణరెడ్డి, మిట్ట రంగారెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ హఠావో.. నిరుద్యోగి బచావో

కొడంగల్ రూరల్: నిరుద్యోగ జేఏసీ పిలుపు మేరకు నియోజకవర్గంలోని నిరుద్యోగులు కేసీఆర్ హఠావో.. నిరుద్యోగి బచావో కార్యక్రమాన్ని దినచర్యగా చేపట్టాలని నిరుద్యోగ జేఏసీ సభ్యులు కోరారు. ఇందులో భాగంగా వారు ఆదివారం నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడారు. పదేళ్లుగా నిరుద్యోగుల పట్ల జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా నిరుద్యోగులు సంఘటితంగా అన్యాయాన్ని నిలదీసేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయనే ఆశతో ఉన్న నిరుద్యోగులకు.. తీరా నిరాశే మిగిలిందని మండిపడ్డారు. ఇందులో నిరుద్యోగ జేఏసీ సభ్యుడు భీమరాజు, భరత్, రామకృష్ణ, దేవిదాస్, గోపాల్, నరేష్, కృష్ణ, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా పేరు నమోదు చేసుకోండి

తాండూరు రూరల్: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ తారాసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. మంగళవారంతో గడువు ముగియనుందని, కావున ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

స్థానికులకే అవకాశం ఇవ్వాలి



ప్రహ్లాదరావును కలిసిన స్థానిక నేతలు

కుల్కచర్ల: స్థానికులకే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని బీజేపీ స్థానిక నేతలు కోరారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నియోజకవర్గానికి చెందిన నేతలకు టికెట్ లభించినప్పుడే స్థానిక సమస్యలపై పోరాటం చేయడం సాధ్యమవుతుందని, అంతే కాకుండా కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు. పరిగిలో బీజేపీకి మంచిపట్టు ఉందని, స్థానికులకు, పార్టీ అభ్యున్నతికి పాటుపడే వారికి టికెట్ కేటాయించడం వలన ఉపయోగకర ఫలితాలు ఉంటాయన్నారు. ఇందులో పార్టీ నాయకులు మల్లేశ్ పటేల్, ఏవీ రాములు, శ్రీనివాసులు, రాంచందర్, బాలకృష్ణారెడ్డి, పెంటయ్య గుప్తా, రాము యాదవ్, వెంకటయ్య, నర్సింహులు, గోవింద్ నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హస్తం హయాంలోనే మేలు

- కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్
- పలు గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో భీంభరత్

చేవెళ్ల: ఒక్కసారి అవకాశం ఇవ్వండి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపెడతానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ కోరారు. చేవెళ్ల మండలంలోని దేవునిఎర్రవల్లి, ఊరేళ్ల, మొండివాగు, మల్కాపూర్, కుమ్మెర, రావులపల్లి, ముడిమ్యాల గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. పార్టీ అధికారంలోకి రాగానే అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు అవుతాయని చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు మేలు జరిగిందంటే అది కాంగ్రెస్ హయాంలోనేని చెప్పారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు రూ.500లకు గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ.2,500లు, 4వేల పింఛన్లు, 200ల యూనిట్ల ఉచిత విద్యుత్ ఇలా కాంగ్రెస్ ప్రకటించిన పథకాలను పక్కగా అమలు చేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ప్రచారంలో ఆయనకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి, పీసీసీ నాయకులు జనార్దన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, గోనె ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సర్పంచ్ శైలజ, పార్టీ మహిళ అధ్యక్షురాలు సమత, సరిత, వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ యాదమ్మ, ఆగిరెడ్డి, శ్రీనివాస్, పెంటారెడ్డి, రాములు, మల్లేశ్, బక్కయ్య, మద్దెల శ్రీనివాస్, బి. యాదిరెడ్డి, ప్రభాకర్, కుమార్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని బీఆర్‌ఎస్



మర్పల్లి: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ధారూరు: పార్టీలో చేరిన వారితో నేతలు

- ఏ ఒక్క హామీ నెరవేర్చని ప్రభుత్వం
- కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు

మర్పల్లి: ప్రజాసమస్యలు పట్టించుకోని బీఆర్‌ఎస్ వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్‌ను ఓటు అనే వజ్రాయుధంతో ఓడించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గూడెం రాములు యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో స్థానిక నాయకులతో కలిసి పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ పూర్తిగా నెరవేర్చలేదని ఆరోపించారు. గతంలో మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని, అందుకే బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు విసుగు చెంది, కాంగ్రెస్ పట్ల ఆదరణ చూపుతున్నారని తెలిపారు. ప్రజాదరణతో ప్రసాద్ కుమార్ గెలుపు ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే ఆరు సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. ఇందులో మాజీ ఉప సర్పంచ్ జాఫర్, బీసీసెల్ మండల అధ్యక్షుడు సర్వేశ్, మండల సీనియర్ నాయకులు నర్సింహులు యాదవ్, వెంకటేశం, విజయ్‌కుమార్ ఉన్నారు.

పలువురి చేరిక

ధారూరు: హరిదాస్‌పల్లి, చింతకుంట గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆ పార్టీ ధారూరు మండలం అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందులో సీనియర్ నాయకుడు ఇబ్రహీం ఉన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండల పరిధి సలీంపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు సుమారు 40 మంది మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వ్యక్తిగత దూషణలు సరికావు

- బీఆర్‌ఎస్ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

కొత్తూరు: షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను హీరో కమల్‌హాసన్‌ను మించిన మహా నటుడని ఇటీవల మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని బీఆర్‌ఎస్ మండల నాయకులు హితవు పలికారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే, ఆయన కుమారులపై చేస్తున్న వ్యక్తిగత విమర్శలను వెంటనే మానుకోవాలన్నారు. లేని పక్షంలో బీఆర్‌ఎస్ నాయకుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఏ ప్రజాప్రతినిధిని కూడా ఎమ్మెల్యే ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టలేదన్నారు. పాలన వ్యవహారంలో కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగతంగా ఆరోపిస్తున్నట్లుగా ఎమ్మెల్యే కుమారుల ప్రమేయం ఎంతమాత్రం లేదన్నారు. వారు పేర్కొన్నట్లుగా షాద్‌నగర్‌కు ముగ్గురు ఎమ్మెల్యేలు కాదని కాంగ్రెస్‌కు ఓటేస్తే ముప్పై మంది ఎమ్మెల్యేలుగా చలామణి అవుతారన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో షాద్‌నగర్‌లో జరగని అభివృద్ధి బీఆర్‌ఎస్ పాలనలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తొమ్మిదేళ్లలో చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మె సత్యనారాయణ, క్లోం నర్సింహ్మారెడ్డి, లింగంనాయక్, బాలయ్య, జైపాల్, దామోదర్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.